క్లుప్తంగా

ఇల్లు లేని నిరుపేదలకు మరో అవకాశం

నాదెండ్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'హౌసింగ్ ఫర్ ఆల్' పథకం కింద ఇంటి స్థలాలు లేని నిరుపేద కుటుంబాలు అర్హత పొందేందుకు అవకాశం అందుబాటులో ఉందని నాదెండ్ల తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో నివసించే ఇల్లు లేని తక్కువ ఆదాయ గల కుటుంబాలు తమ సమీప సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థులు కుటుంబానికి మంజూరైన రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజుఫోటోలతో అర్జీను దాఖలు చేసుకోవాలన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

నూజెండ్ల: ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బందిపై ఉందని గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి గిరిధర్ అన్నారు. మండల కేంద్రమైన నూజెండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై వైద్య ఆరోగ్య సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ ఈ వ్యాధి భూగర్భ జలాలు, నదీ జలాలు, ఫ్లోరైడ్ కలిగిన మందుల వలన వ్యాపించే అవకాశం ఉందన్నారు. 16 సంవత్సరాలు నిండిన పిల్లలందరికి ఫ్లోరోసిస్ టెస్టులు చేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విమలకుమారి, సిబ్బంది సుబాని, సరిత, మేరీరాణి, సురేఖ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చేస్తే కేసులు



నాదెండ్ల: మండలంలోని గణపవరం సెక్షన్ పరిధిలో 14 గ్రామాల్లో 29 బ్యాచ్‌లుగా విద్యుత్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాసరావు, గుంటూరు-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏడుకొండలు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో విద్యుత్ చౌర్యం, అధిక లోడు వినియోగిస్తున్న 58 సర్వీసుల నుండి రూ.1,85,600లు అపరాధ రుసుం, జరిమానా వసూలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరం క్రింద పరిగణించబడుతుందన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై జరిమానాలతో పాటూ జైలు శిక్ష ఉంటుందన్నారు. అనధికార విద్యుత్ వినియోగం చేసే వారిపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులు గురునాధరావు, మల్లికార్జునప్రసాద్, రవికుమార్, అశోక్‌కుమార్, వీరేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కోసం దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట రూరల్: ఇంటి స్థలాలు లేని వారు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలలో ఇంటి నివేశ స్థలాల కోసం అర్జీలు దాఖలు చేసుకోవాలని తహసీల్దార్ కె.వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. పట్టణ, మండలంలోని గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

నరసరావుపేట: కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బసవ గ్యాస్ట్రో అండ్ లివర్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, హెపటోబిల్లియరీ సర్జన్ డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ పాల్గొని వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, ఈసీజీ, జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ వ్యాధులతో పాటు లివర్, గ్యాస్ట్రబుల్ తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హైరిస్క్ వ్యక్తులకు హెపటైటిస్ బీ,సీ నిర్ధారణ పరీక్షలు

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ కార్యాలయంలో శుక్రవారం హెపటైటీస్ బీ, సీ పరీక్షలు నిర్వహించి వ్యాక్సిన్ వేశామని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్‌బెంజిమెన్ పేర్కొన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ సహకారంతో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశాక్స్) ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్ఐవీ నివారణ కోసం హైరిస్క్ ఉన్న వ్యక్తులకు హెపటైటిస్ పరీక్షలు నిర్వహించి అవి ఉన్నవారికి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ఐవీతో పాటు ఇతర వైరల్ ఇన్‌ఫెక్షన్లను అరికట్టడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ రవి మాట్లాడుతూ హెపటైటిస్ బీ, సి పాజిటివ్ అయితే గుంటూరు జీజీహెచ్‌లో సమగ్రమైన చికిత్స సదుపాయం ఉందన్నారు. అలాగే దీనికి వైరల్ లోడ్ పరీక్ష కూడా చేసి సంపూర్ణమైన చికిత్సను అందిస్తారని తెలియజేశారు. దీనికి ఏ విధంగానో భయపడవలసిన పనిలేదని తెలియజేశారు.

వైఎస్సార్ సీపీ వినుకొండ
నియోజకవర్గ అనుబంధ కమిటీలు ఇవే



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని వినుకొండ మున్సిపాల్టీ, వినుకొండ మండలం, ఈపూరు, శావల్యాపురం, బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల పలు విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు...

వినుకొండ పట్టణ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

యూత్‌వింగ్ అధ్యక్షులుగా నర్రా చరణ్, మహిళా విభాగంకు చింతలపూడి దుర్గ, రైతు విభాగంకు రొద్దా చిన్న పుల్లారెడ్డి, బీసీసెల్‌కు గుంజి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌కు రెడ్డిబోయిన ప్రవీణ్‌కుమార్, ఎస్టీ సెల్‌కు మాటా సత్యం, మైనార్టీసెల్‌కు పసుమర్తి షేక్ నాగూర్‌బాష నియమితులయ్యారు. క్రిస్టియన్ మైనార్టీ వింగ్‌కు సురభి జోసెఫ్, స్టూడెంట్ వింగ్‌కు షేక్ ఇర్ఫాన్, పంచాయతీరాజ్ వింగ్‌కు షేక్ బాజి, ఆర్‌టీఐ సెల్‌కు షేక్ షహీద్, వలంటీర్ల వింగ్‌కు తిరుక్కువల్లూరి అనీల్‌కుమార్, గ్రీవెన్స్‌సెల్‌కు కొత్తా సైదారావు, వాణిజ్య విభాగంకు చందోలు నాగాంజనేయులు, వీవర్స్ వింగ్‌కు చేవూరి రంగబాబు, అంగన్‌వాడీ వింగ్‌కు తెట్టెం మంగమ్మ, కల్చరల్‌కు జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సోషల్‌మీడియాకు షేక్ రోషన్ జమీర్ జానిబాష, దివ్యాంగులకు అన్నపురెడ్డి నాగేంద్రరెడ్డి, బూత్‌కమిటికి షేక్ బాదుల్లా, పబ్లిసిటీకి షేక్ మస్తాన్‌వలి, మున్సిపల్ వింగ్ అధ్యక్షులుగా పిడతల దేవదాసు నియమితులయ్యారు.

శావల్యాపురం మండల అనుబంధ విభాగ అధ్యక్షులు

యూత్‌వింగ్‌కు బొల్లా సుబ్బారావు, మహిళా విభాగంకు పొత్తూరి చంద్రమ్మ, రైతు విభాగంకు అబ్బూరి చిన్న అయ్యన్న, బీసీసెల్‌కు మద్దిగుంట్ల ఏడుకొండలు, ఎస్సీ సెల్‌కు దారిమోషే, ఎస్టీ సెల్‌కు శిక్కవరపు బాలకృష్ణ, మైనార్టీసెల్‌కు షేక్ సైదులు, క్రిస్టియన్‌మైనార్టీసెల్‌కు కాకాని నాన్నయ్య, విద్యార్థి విభాగంకు పొతుల వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్‌కు మర్రిశెట్టి శివరామప్రసాదు, ఆర్‌టీఐ వింగ్‌కు మోదుగుల వెంకటరావు, వలంటీర్ల వింగ్‌కు దావులూరి శ్రీనివాసరావు, గ్రీవెన్స్‌సెల్‌కు సూరబోయిన సాంబశివరావు, వాణిజ్యవిభాగంకు చిలకా వెంకటసాంబశివరావు, అంగన్‌వాడీ వింగ్‌కు తోట రవికుమార్, కల్చరల్ వింగ్‌కు నల్లబోలు శ్రీహరి, సోషల్‌మీడియాకు ఎదుపతి గోపి, దివ్యాంగుల విభాగంకు పోపూరి ఆలిబాబు, బూత్‌కమిటి వింగ్‌కు పూరేటి రామాంజనేయులు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా పాపసాని సురేష్ నియమితులయ్యారు.

నూజెండ్ల మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

యూత్‌వింగ్ అధ్యక్షులుగా గొట్టం బ్రహ్మారెడ్డి, మహిళా విభాగంకు మేకల విజయ, రైతు విభాగంకు యక్కంటి నారాయణరెడ్డి, బీసీసెల్‌కు గాలం నాగేశ్వరరావు, ఎస్సీ సెల్‌కు దుపాటి రాజు, ఎస్టీ సెల్‌కు మొగిలి మూగయ్య, మైనార్టీ సెల్‌కు గద్వాల చినఆదాం, క్రిస్టియన్‌మైనార్టీసెల్‌కు పులుగుజ్జు యోహాను, విద్యార్థి విభాగంకు ఇందూరి శివలింగారెడ్డి, పంచాయతీవింగ్‌కు మోతుకూరి వెంకటరావు, ఆర్‌టీఐ వింగ్‌కు పేరం రాజశేఖరరెడ్డి, వలంటీర్లకు సురభి సురేష్, గ్రీవెన్స్‌సెల్‌కు కట్టెంపూడి విజయబాబు, వాణిజ్యవిభాగంకు కురికుంట్ల కోటేశ్వరరావు, వీవర్స్ వింగ్‌కు తోట శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వింగ్‌కు కందుల వెంకటరెడ్డి, కల్చరల్ వింగ్‌కు మాగులూరి పాపారావు, సోషల్‌మీడియా వింగ్‌కు లక్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, దివ్యాంగుల విభాగంకు కొణికి శ్రీను, బూత్‌కమిటి వింగ్‌కు కుర్రా పాపిరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా పరిమి అంజయ్య నియమితులయ్యారు.

బొల్లాపల్లి మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

యూత్‌వింగ్ అధ్యక్షులుగా ఆలా సాంబిరెడ్డి, మహిళా విభాగంకు తిప్పిశెట్టి రమణమ్మ, రైతు విభాగంకు బూసి అంజిరెడ్డి, బీసీ సెల్‌కు పుచ్చకాయల యర్రయ్య, ఎస్సీ సెల్‌కు మేడిపల్లి వెంకటరావు, ఎస్టీ సెల్‌కు మేరాజ్యోతు అంజా నాయక్, మైనార్టీసెల్‌కు ఇట్లపురం పెద్ద సుభాని, క్రిస్టియన్ మైనార్టీసెల్‌కు కంభంపాటి రాజేష్, విద్యార్థి విభాగంకు పత్ర గంగరాజు, పంచాయతీరాజ్ విభాగంకు అన్నెంపున్నారెడ్డి, ఆర్‌టీఐ వింగ్‌కు బారెడ్డి కృష్ణారెడ్డి, వలంటీర్లకు మదిర భాస్కరరెడ్డి, గ్రీవెన్స్‌సెల్‌కు గాలం గోవిందరాజు, వాణిజ్యంకు అర్వపల్లి నాగేశ్వరరావు, అంగన్‌వాడీకి వడ్డరపు తిరుపతయ్య, కల్చరల్‌కు జాడ కోటయ్య, సోషల్‌మీడియాకు బేలం ప్రతాపరెడ్డి, దివ్యాంగులకు నేనావత్ బాలూనాయక్, బూత్ కమిటీకి తిమ్మినేని బ్రహ్మారెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా ముండ్రు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

ఈపూరు మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

యూత్‌వింగ్ అధ్యక్షులుగా దావులూరి రాజేష్, మహిళా విభాగంకు చాపాల అంజమ్మ, రైతు విభాగంకు యెండ్లూరి రామారావు, బీసీసెల్‌కు కొలగాని యోగయ్య, ఎస్సీ సెల్‌కు వంగల ఇజ్రాయేలు, ఎస్టీ సెల్‌కు రామావత్ రామ్మూర్తి నాయక్, మైనార్టీసెల్‌కు షేక్ మాబూవలి, క్రిస్టియన్‌మైనార్టీసెల్‌కు వల్లమీసాల చెంచయ్య, విద్యార్థి విభాగంకు మేరాజోత్ వాగ్యానాయక్, పంచాయతీ రాజ్‌కు కాకనబోయిన శ్రీనివాసరావు, ఆర్‌టీఐకు మూలే అంకిరెడ్డి, వలంటీర్లకు అల్లూరి సుబ్బారెడ్డి, గ్రీవెన్స్‌కు పాలిశెట్టి సుబ్బారావు, వాణిజ్యానికి వద్దు వెంకటరెడ్డి, వీవర్స్‌కు దండే కోటేశ్వరరావు, అంగన్‌వాడీకి బాదా శ్రీనివాసరావు, కల్చరల్‌కు గాలం చెంచయ్య, సోషల్‌మీడియాకు చాలా శ్రీనివాసరావు, దివ్యాంగులకు ముల్లమూరి సుబ్బారావు, బూత్‌కమిటీకి కమ్మెత శ్రీనివాసరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా బొమ్మనబోయిన శ్రీనివాసరావు నియమితులయ్యారు.

వినుకొండ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

యూత్‌వింగ్ అధ్యక్షులుగా బిక్కి నరేంద్ర, మహిళా విభాగంకు బొగాల చిన్నమ్మాయి, రైతు విభాగంకు చింతా నాగిరెడ్డి, బీసీసెల్‌కు బత్తుల శ్రీకాంత్, ఎస్సీ సెల్‌కు కొమ్మతోటి పాపారావు, ఎస్టీ సెల్‌కు దేవర రాంబాబు, మైనార్టీసెల్‌కు షేక్ సాయిబాబు, క్రిస్టియన్‌మైనార్టీవింగ్‌కు జొన్నలగడ్డ కోటేశ్వరరావు నియమితులయ్యారు. విద్యార్థి విభాగంకు కొఠారి బ్రహ్మం, పంచాయతీకి అమృతపూడి రత్నాకర్, ఆర్‌టీఐ సెల్‌కు తాళ్లూరి శ్రీనివాసరావు, వలంటీర్ల వింగ్‌కు అన్నవరముద్ది శివపార్వతి, గ్రీవెన్స్‌సెల్‌కు భవనం సునీల్‌రెడ్డి, వాణిజ్య విభాగంకు పెద్దిరెడ్డి అయ్యపురెడ్డి, అంగన్‌వాడీ వింగ్‌కు బారెడ్డి ఉషారాణి, కల్చరల్ వింగ్‌కు తిరుమల ప్రభాకర్, సోషల్ మీడియా వింగ్‌కు మొండితోక స్టీఫెన్‌బాబు, దివ్యాంగుల విభాగంకు సోమేపల్లి చిన్నశివ, బూత్‌కమిటీ వింగ్‌కు వల్లమ్ శ్రీనివాసరావు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా గుంటూరు రామకోటేశ్వరరావు నియమితులయ్యారు.

డిమాండ్ల సాధన కోసం కార్మికుల బైక్ ర్యాలీ

- 12 నుంచి ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె
- వారికి మద్దతుగా ఈనెల 15 నుంచి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె
- ప్రకటించిన సీఐటీయూ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

నరసరావుపేట: తమ డిమాండ్లను తక్షణం నెరవేర్చాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గత మూడు నెలలుగా మున్సిపల్ కార్మికులు జీతాలు పెంచాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులలో ఎటువంటి చలనం లేదని సీఐటీయూ గౌరవాధ్యక్షులు షేక్ శిలార్ అన్నారు. కార్మికుల కార్మికుల మధ్య గొడవలు సృష్టించడానికి ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పరిస్థితి అంతవరకు రానీయకుండా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచి కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రోత్సవాన్ని జయప్రదం చేయండి

ఓరియంటల్ పాఠశాల పూర్వ విద్యార్థులు



విలేకరులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీరామకృష్ణా ఓరియంటల్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నట్లు పాఠశాల పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. వజ్రోత్సవాలను నిర్వహించనున్న శ్రీపట్టాభిరామ స్వామి దేవాలయంలోని శ్రీవేంకటేశ్వర కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్వ విద్యార్థులు కపలవాయి విజయకుమార్, జూలకంటి సీతారామాంజనేయులు, గట్టా శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వర్లు, వి.వి.అంజనీకుమార్, ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్ (పూర్వవిద్యార్థి) మాట్లాడుతూ, పల్నాడు జిల్లాలో ఏకైక ఓరియంటల్ పాఠశాలగా వజ్రోత్సవం నిర్వహించుకోవటం ఆనందంగా ఉందన్నారు. దేశం నలుమూలలా స్థిరపడిన వారితో పాటు విదేశాలలో ఉంటున్న పూర్వ విద్యార్థులు ఎందరో ఈ వేడుకలకు హాజరవుతున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థుల సహకారంతోనే 2012లో స్వర్ణోత్సవాలు జరుపుకున్న విషయాన్ని గుర్తు చేశారు. తిరిగి వారి సహకారం, భాగస్వామ్యంతో వజ్రోత్సవాలు జరుపుతున్నట్లు వివరించారు. పూర్వ విద్యార్థులు ఎక్కడ ఉన్నా అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మహనీయుడు సుబ్బరాయ శ్రేష్టి

నరసరావుపేటలో నేడు సంస్మరణ సభ



నరసరావుపేట ఈస్ట్: మనిషి పుట్టుక మొదలుకొని గిట్టిన అనంతరం నిర్వహించే కర్మకాండల వరకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఏడున్నర దశాబ్దాల క్రితమే నరసరావుపేటకు అందించిన మహనీయుడు నాగసరపు సుబ్బరాయశ్రేష్టి. పల్నాడు ప్రాంత ఆర్యవైశ్య ప్రముఖునిగా పేరుపొందిన సుబ్బరాయశ్రేష్టి దాతృత్వాన్ని నాటి పెద్దలు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా సమావేశాలలో చెప్పడం తరచూ వినిపించి కనిపిస్తున్న దృశ్యం.

పల్నాడురోడ్డులోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేకంగా బిడ్డకు జన్మనిచ్చే ప్రసూతి గది మొదలుకొని చిన్నారి పెరిగి విద్యార్థిగా వెళ్లే పాఠశాల, ఉన్నత చదువులకు కళాశాలను ఏర్పాటు చేసిన విద్యాదాత సుబ్బరాయశ్రేష్టి. విద్యకు ఎడారిగా ఉన్న పల్నాడు ప్రాంతంలో 1950వ సంవత్సరంలోనే రూ. లక్ష విరాళంతో ఆయన స్థాపించిన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో పల్నాడు, రాయలసీమ ప్రాంత విద్యార్థులు ఎందరో ఉన్నత విద్యను అభ్యసించి దేశ విదేశాలలో ఈప్రాంత ఖ్యాతిని చాటారు. తాగునీటికి కటకటలాడే పట్టణ ప్రజల ఇబ్బందులను గమనించి పాతూరు చెరువుకట్ట వద్ద సొంత ఖర్చులతో బావి తవ్వించి ప్రజల దాహార్తిని తీర్చారు.

దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నాగసరపు బావి నుంచే పట్టణ ప్రజలు తాగునీటి అవసరాలను తీర్చుకున్నారంటే అప్పటి పరిస్థితిని, సుబ్బరాయ శ్రేష్టి దాతృత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇదే ప్రాంతంలో మనిషి మోక్షానికి అవసరమైన కర్మకాండలు జరుపుకునేందుకు కర్మల సత్రం నిర్మించారు. దైవ భక్తి కలిగిన సుబ్బరాయశ్రేష్టి ఏడు దశాబ్దాల క్రితమే శ్రీపట్టాభిరామస్వామి ఆలయాన్ని నిర్మించారు. కృష్ణానదిలో లభించిన నల్లరాయితో మలచిన సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి రూపం కన్నుల పండుగగా దర్శనమిస్తుంది. నాటి పెద్దలు ప్రవేశపెట్టిన నగర సంకీర్తన నేటికీ కొనసాగుతుండటం స్వామివారి పట్ల భక్తులకు ఉన్న ప్రగాఢ విశ్వాసానికి నిదర్శనం.

పట్టణ ప్రజలకు సుబ్బరాయ శ్రేష్టి దాతృత్వం ద్వారా అందిన సేవలను కుమారుడు నాగసరపు రామారావు, ప్రస్తుతం ఆయన మనవడు సుబ్బరాయ గుప్త కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. నిత్య జీవితంలో మనిషికి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించిన దాత సుబ్బరాయశ్రేష్టి సంస్మరణ సభను శనివారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నారు.

ఇంటి స్థలాలకై దరఖాస్తు చేసుకోండి

నూజెండ్ల: మండల పరిధిలోని స్వంత గృహాలు లేని నిరుపేదలు ఇంటి స్థలము కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ రమేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అందరికీ గృహాలు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకూ ప్రభుత్వం నుండి ఎటువంటి ఉచిత నివాస గృహాలు పొందని అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకొవచ్చన్నారు.

పొగాకు కొనుగోళ్లలో జాప్యం ఆందోళనకరం

యడ్లపాడు: యడ్లపాడు మండలంలోని స్పైసెస్ పార్క్ వద్ద నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. చిలకలూరిపేట, యడ్లపాడు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమై 20 రోజులు గడిచినా, ఇప్పటి వరకు కేవలం 5వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. నియోజకవర్గంలో 99వేల క్వింటాళ్ల నిల్వ ఉండగా రోజుకు 300 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేస్తే మిగిలింది ఎప్పుడు పూర్తి చేస్తారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకునేలా చేస్తామన్నారు.

రీ సర్వేపై సమీక్ష

ముప్పాళ్ళ: రీ సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ కే నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వే సిబ్బందితో రీ సర్వేపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన రీ సర్వే ప్రక్రియ వివరాలు పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని సర్వే సిబ్బంది తహసీల్దార్‌కు వివరించారు. రికార్డుల పరిశీలన చేపట్టాల్సి ఉందని, అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉందని చెప్పారు. ఆయనతో పాటు డీటీ బాలవెంకటేష్, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక



శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 2024 ఎప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన 464 పనులకు రూ. 7కోట్లు 94 లక్షల 2వేల 716 రూపాయల ఉపాధి నిధులతో చేసిన పనులకు సంబంధించిన ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. తొలిత గ్రామపంచాయతీల వారీగా గ్రామాల్లో ఫీల్డ్ అసిసెంట్స్ చేసిన పనులకు సంబంధించి నిధులు వివరాలు అవకతవకలు తదితర వాటిని ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో డీఆర్‌పీలు చదవి వినిపించారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఆడిట్‌లో జిల్లా విజిలెన్స్ అధికారి హిరాలాల్, ఏపీడీ బూసిరెడ్డి, ప్రోగ్రాం మేనేజరు రాష్ట్ర పరిశీలకులు ఈశ్వర్, క్వాలిటీ అధికారి ప్రభాకర్, ఎస్ఆర్‌పి బత్తుల ఆవులయ్య, ఏపీయం కట్టా నాగేశ్వరరావు, పి.రామారావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్యసేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



లాప్రోస్కోపిక్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి

నరసరావుపేట: వైద్యరంగంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందజేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వినుకొండరోడ్డులోని పి.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతాశ్రీ హాస్పిటల్‌లో సుమారు రూ.1 కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన త్రీడీ లాప్రోస్కోపిక్ పరికరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ గోపిరెడ్డి వేర్వేరుగా హాజరై ప్రారంభించారు. ఈ పరికరం సహాయంతో ల్యాబ్‌లో ఓ రోగికి చేస్తున్న శస్త్ర చికిత్సను పరిశీలించారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ త్రీడీ లాప్రోస్కోపిక్ పరికరాన్ని జిల్లాలోని నరసరావుపేటలో తొలిసారి ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందన్నారు. శరీరంలోని భాగాలు, నరాలు చాలా పెద్దవిగా 3డీలో కన్పిస్తూ ఉండటం వలన శస్త్రచికిత్స చాలా సులువుగా సురక్షితంగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాదు, గుంటూరు, విజయవాడ లాంటి పట్టణాలకు వెళ్లకుండా అత్యంత ఆధునికమైన సర్జరీలు చేసేందుకు ఇటువంటి పరికరాలు ఉపయోగపడతాయన్నారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తమ హాస్పిటల్ ద్వారా అడ్వాన్స్‌డు లాప్రోస్కోపిక్ సర్జరీ విధానాలను జిల్లా ప్రజలకు పరిచయం చేస్తున్నామన్నారు. దీనికోసం ప్రత్యేకంగా జర్మనీలో తయారైన త్రీడీ-4కే లాప్రోస్కోపిక్ మెషీన్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి, కామిరెడ్డి కృష్ణ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశోధనలకు క్యాంటం కంప్యూటేషన్ కీలకం

ఫార్మ్‌వైడ్ ఏఐఎంఎల్ ప్లాంట్ ఫామ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మీకుమార్ రెడ్డి



లక్ష్మీకుమార్ రెడ్డిని సత్కరిస్తున్న శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: భవిష్యత్ తరం పరిశోధనలకు క్యాంటం కంప్యూటేషన్ కీలక మార్గంగా నిలుస్తుందని ఫార్మ్‌వైడ్ ఏఐఎంఎల్ ప్లాంట్ ఫామ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మీకుమార్ రెడ్డి తెలిపారు. గౌహతి ఐఐటి సహకారంతో ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంటమ్ కంప్యూటేషన్ పై రెండు వారాల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లక్ష్మీకుమార్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఏఐ, ఎంఎల్‌లు విశేషమైన ప్రాధాన్యత పొందుతున్నాయని తెలిపారు. భవిష్యత్ విద్యా రంగానికి, విద్యార్థుల వృత్తి జీవనానికి ఏఐ, ఎంఎల్ ప్రాధాన్యతను వివరించారు. ఫ్యాకల్టీ సభ్యులు తమ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో నేడు విద్యుత్ అంతరాయం

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: చిలకలూరిపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రాల్లో (సబ్ స్టేషన్లలో) చేపడుతున్న వార్షిక నిర్వహణ పనుల కారణంగా, కింది ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు పూర్తిగా విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అధికారులతో సహకరించాలని కోరారు. చిలకలూరిపేట పట్టణం, యడ్లపాడు మండలంలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదు. చిలకలూరిపేట రూరల్ మండలంలో వేలూరు, కుక్కపల్లివారిపాలెం, పంగులూరి వారి పాలెం, పసుమర్రు, బొప్పూడి, కావూరు, కట్టుబడి వారిపాలెం గ్రామాలు, నాదెండ్ల మండలంలో అమీన్ సాహెబ్‌పాలెం, కనపర్రు, ఇర్లపాడు, ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారిపాలెం, గున్నావారిపాలెం, గణపవరం, రాజీవ్‌గాంధీ కాలనీ, బోస్ గారి మిల్, కోళ్లపారం, నాదెండ్ల, చిరుమామిళ్ల, గోరిజవోలు, సంకరాత్రిపాడు, జంగాలపల్లి, తూబాడు ప్రాంతాల్లో గృహాలు, వ్యవసాయ నీటి పంపులు, వాణిజ్య సంస్థలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలకు విద్యుత్ ఉండదన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేటటౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ జి.ఎల్.వి. ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. నరసరావుపేట 220 కెవి సబ్ స్టేషన్ నందు అత్యవసర మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా నరసరావుపేట ఈ1, ఈ2, ఈ3 సెక్షన్‌ల పరిధిలోని 33 కెవి మరియు 11 కె.వి లైన్లు ట్రీ కటింగ్ మరియు మరమ్మతులు చేపడతారన్నారు. కావున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు

రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల రెడ్డి పాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిబాపన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ కె. రాంబాబు తెలిపారు. అలాగే త్రీఫేస్ కరెంట్ శనివారం ఉదయం 1 గంట నుంచి 9 గంటల వరకు సరఫరా అవుతుందన్నారు.

చినుకు లేదు - కునుకు రాదు!

బట్టతడుపుకే పరిమితమైన చినుకులు



దుక్కులు చేయక బీళ్లుగానే ఉన్న మాగాణి భూములు

రొంపిచర్ల: మండలంలో జులై నెలలో వర్షపాతం నామమాత్రంగానే ఉంది. జులై నెల ప్రారంభం నుండి ఇప్పటి వరకు మూడు రోజులు నామమాత్రంగా కురిసింది. గత వారం రోజులుగా ప్రతి రోజూ మండలంలో వడగాలులు, ఎండ తీవ్రతతో నెలకొన్న వాతావరణం ప్రజలను ఇబ్బంది పెడుతుంది. సాయంత్రం ఐదు గంటల నుండి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతం అవుతుంది. అయితే మండలంలో ఏదో ఒక గ్రామంలో బట్టతడుపు చినుకులు పడటం మినహా ఇంత వరకు ఎక్కడా దుక్కిపాటి వర్షం పడలేదు. మెట్ట పంటల సాగుకు సమయం మించి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్‌కు వరద నీరు వస్తుండటంతో మాగాణి పంటల సాగుకు నీరు వస్తుందని రైతులు నమ్మకంతో ఉన్నారు. అయితే పచ్చిరొట్ట పైర్లను ముందుగానే సాగు చేసుకునేందుకు వర్షాలు లేవు. దీంతో మాగాణి సాగు చేసే రైతాంగం కూడా ఆలోచనలో పడింది. సాగు భూములలో దుక్కులు చేసేందుకు సరిపడ వర్షాలు లేకపోవడంతో భూములన్ని బీళ్లుగానే ఉన్నాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో గురు, శుక్ర వారాల్లో సాయంత్రం వేళ బట్టతడుపు చినుకులు పడగా, ఈ నెల 1వ తేదీన 2.6 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా, 2వ తేదీన 3.4 ఎం.ఎం, 3వ తేదీన 4.2 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. తరువాత రోజుల్లో మండలంలో అక్కడక్కడ బట్టతడుపు చినుకులు మినహా వర్షం కురియలేదు. గత ఏడాది జులై నెలలో 11వ తేదీ నాటికి 40.4 ఎం.ఎం. వర్షపాతం నమోదు కాగా ఈ ఏడాది 10.2 ఎం.ఎం. వర్షపాతానికి పరిమితమైంది.

సహాయనిధితో...

చిలకలూరిపేట(యడ్లపాడు): ప్రాణాంతక వ్యాధులతో బాధపడే పేదల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంగా మారిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే చిలకలూరిపేట మండలంలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, మానుకొండవారిపాలెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.